క్లుప్తంగా

ఆధ్యాత్మికతపై దృష్టి పెట్టాలి

– హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి వినోద్



నగర సంకీర్తనలో నృత్యం చేస్తున్న భక్తులు

జహీరాబాద్: మానవుడు తన కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే ఆధ్యాత్మికతపై దృష్టి సారించాలని హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధి డాక్టర్ వినోద్ ప్రభూజీ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని భవానీ మాత ఆలయంలో 154వ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జరిగిన సత్సంగ్‌లో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్‌లో దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన భారత జవాన్‌లకు నివాళులర్పించారు. అంతకు ముందు రాచన్నపేట్, సుభాష్‌గంజ్ ప్రాంతాల్లో హరినామ సంకీర్తన చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్ప స్వామి ఉత్సవాలు



అత్నూర్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రత్నాపూర్, అత్నూర్ గ్రామాల్లో బీరప్ప స్వామి జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆయా గ్రామాల్లో స్వామి వారి కల్యాణం, బోనాలు, ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. రత్నాపూర్‌లో సోమవారం ఉత్సవాలు ముగియనుండగా, అత్నూర్‌లో మరో రెండు రోజులు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

ప్రతిభావంతులకు సన్మానం



ప్రతిభావంతులను సన్మానిస్తున్న ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

కంగ్టి(నారాయణఖేడ్): చదువుతో పాటు ఉద్యోగ సాధనలో మంచి ప్రతిభ కనబర్చిన నలుగురు పోలీస్ కానిస్టేబుల్స్‌తో పాటు ఇద్దరు టెన్త్ క్లాస్ టాపర్స్‌కు జమ్గి(కే) గ్రామానికి చెందిన ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, వాందాస్, అఖిల్, రాజు ఇటీవల జరిగిన పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాగా పదవ తరగతిలో అధిక మార్కులు సాధించిన వైష్ణవి, కవితను ఉద్యోగులు సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఏట ప్రవీణ్‌చారీ, ఉపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక వాతావరణం



మల్లికార్జున స్వామిని దర్శించుకుంటున్న శ్రీనివాస్ గౌడ్

పటాన్ చెరు: జాతర నిర్వహణతో ఆధ్యాత్మిక వాతావరణం చోటు చేసుకుంటుందని పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఘనపూర్ గ్రామంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధపౌర్ణమిని ఘనంగా నిర్వహించండి

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సోమవారం బుద్ధపౌర్ణమిని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించాలని నియోజకవర్గ భీమ్ ఆర్మీ అధ్యక్షుడు అనుముల తుకారాం కోరారు. అంబేడ్కర్ భవన్‌లో వేడుకకు ఏర్పాట్లు చేసి బుద్ధుడి బోధనలపై చర్చలు, దీప ప్రదానాలు, బౌద్ధ ధర్మ సందేశాలు, బుద్ధుడి శాంతి సందేశాన్ని ప్రజల్లో వ్యాప్తి చేయాలన్నారు.



కొన్యాల గ్రామ శివారులోని మంజీరా నదిపై ఉన్న బ్రిడ్జి వద్ద ఒకవైపు పరుచుకున్న గుర్రపు డెక్క

గుర్రపు డెక్కను తొలగించరూ..

- మూగజీవాలు, మత్స్యకారులకు పొంచి ఉన్న ప్రమాదం
- మంజీరా నదిలో కిలోమీటర్ మేర పర్చుకున్న వైనం
- పట్టించుకోని అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మంజీరా నదిలో గుర్రపుడెక్క పెరగడంతో మూగజీవాలు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హత్నూర మండలం కొన్యాల గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద కిలోమీటర్ మేర నీటిపై గుర్రపుడెక్క పరుచుకుంది. మరోపక్క మంజీరా నీరు తేటగా ప్రవహిస్తుంటే ఒకపక్క మాత్రం గుర్రం డెక్క ఉండటంతో అటుగా వెళ్లిన పశువులు, చేపల వేట కోసం వెళ్లిన మత్స్యకారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. జీవనోపాధి కోసం పరిసర గ్రామాల మత్స్యకారులు నదిలో చేపల వేట కోసం వెళ్లి గుర్రపు డెక్క ఉండటంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొన్యాల బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని పరిసర ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జికి మరోవైపు మంజీరా నదిలో తేటగా ఉన్న నీరు

కులసంఘాల అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్

పటాన్ చెరు: కుల సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం జీహెచ్‌ఎంసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాలులో తెలంగాణ వీరభద్రీయ (వీర ముష్టి) సంఘం సంగారెడ్డి జిల్లా ఇటీవల నూతన కార్యవర్గ కమిటీ ఏర్పడిన నేపథ్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. బీఆర్‌ఎస్ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, బీఆర్‌ఎస్ యువ నాయకులు పృథ్వీ రాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే మంచి భవిష్యత్తు

పటాన్‌చెరు టౌన్: చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఘణతి ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాల్లో 571 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఆదివారం డివిజన్ పరిధిలోని తన నివాసంలో కార్పొరేటర్ విద్యార్థిని సన్మానించారు. మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సహించిన తండ్రి రాజును అభినందించారు.

ఘనంగా భూ లక్ష్మమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఖేడ్ మండలం తుర్కపల్లి గ్రామంలో భూ లక్ష్మమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవారికి పూజలు, నైవేద్యాల సమర్పణ, బండ్ల ప్రదక్షిణ, అమ్మవారికి బోనాల సమర్పణ, అన్నప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంతో పాటు వివిధ ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మహోత్సవాల్లో భాగంగా సోమవారం పాచి బండ్ల ప్రదక్షిణ, నిండు జాతర, అన్నప్రసాద వితరణ, కుస్తీపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అమ్మ ప్రేమ అనంతం...



నిత్యావసర వస్తువులు, బేబీ కిట్లను పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: అమ్మ ప్రేమ అనంతమని ఎండీఆర్ ఫౌండేషన్ కో- ఫౌండర్ పృథ్వీరాజ్ అన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎండీఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో మాతృ దినోత్సవం సందర్భంగా బాలింత తల్లులకు నిత్యావసర వస్తువులు, బేబీ కిట్లను ఫౌండేషన్ కో-ఫౌండర్ పృథ్వీరాజ్ తన తల్లి మాదిరి తులసి లక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మధు, సభ్యులు, బాలింతలు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి ప్రతిచర్య ఆపరేషన్ సిందూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్య

జిన్నారం (పటాన్‌చెరు): పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది హిందువులు ప్రాణాలు కోల్పోయారని, ఈ దాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ నిలిచిందని గుమ్మడిదల మండల బీజేపీ అధ్యక్షుడు ఐలయ్య అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆదేశాల మేరకు బొంతపల్లి భ్రమరాంబిక మల్లికార్జున ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు భారత ఆర్మీ సరైన గుణపాఠం చెప్పిందన్నారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల ఇన్‌చార్జి నర్సింగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైన్యం క్షేమంగా ఉండాలని పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): భారత సైన్యం క్షేమంగా ఉండాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో స్వయంభుగా వెలసిన శ్రీ సిద్ధివినాయక ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం నిరంతరం పాటు పడుతున్న సైన్యానికి అంతా మంచి జరగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్ పాలికర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం బాణాపూర్‌లోని శ్రీరుక్మిణి పాండురంగ ఆలయంలో ఆదివారం 22వ అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజున నందుమహారాజ్ కీర్తనలు నిర్వహించి ఆధ్యాత్మిక ప్రవచనాలు చెప్పారు. గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో స్పీకర్



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం మన్నాపూర్‌లో ఆదివారం జరిగిన ఓ పెళ్లి వేడుకకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరయ్యారు. పెళ్లి కుమారుడిది వికారాబాద్ కాగా వధువుది మన్నాపూర్ గ్రామం. వరుడి తరపున ఆయన హాజరై నవ దంపతులు చాకలి నర్సిహులు, నవనీతలను ఆశీర్వదించారు. స్పీకర్ వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామపెద్దలు ఉన్నారు.

ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి

కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్



మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నారాయణఖేడ్: ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తెలిపారు. ఖేడ్‌కు వచ్చిన సందర్భంగా ఆదివారం సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ప్రభుత్వం ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో లక్షమంది ముదిరాజ్‌లతో సమమస్యలపై హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు. హైదరాబాద్‌లో ముదిరాజ్ భవనం కోసం ఐదెకరాల స్థలం, కార్పొరేషన్‌కు నిధులు, బీసీ (డీ) నుంచి బీసీ (ఏ) లోకి మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజులు అన్ని గ్రామాల్లో పోటీల్లో నిల్చోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలగాని నర్సింహులు, నాయకులు సురేశ్, శ్రీనివాస్, అల్కారి సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, రామక్రిష్ణ, రవి, శ్రీశైలం, ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తప్పుదోవ పట్టించేందుకే ఆరోపణలు

మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న చింతా గోపాల్, చిత్రంలో బీఆర్‌ఎస్ నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): ఈదులవాగు సమీపంలోగల ప్రభుత్వ అసైన్డ్ భూమిలో చేపట్టిన అక్రమ కట్టడాలను కప్పిపుచ్చుకునేందుకే మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ.. తన సోదరుడు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌పై, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్ అన్నారు. ఆదివారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకుడు శివరాజ్‌పాటిల్ ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతోపాటు తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని మెట్లు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో సెట్‌బ్యాక్‌లో మూడు ఫీట్లలో లిఫ్ట్ నిర్మించామని.. మూడునెలల తరువాత తొలగిస్తానని జిల్లా ఉన్నతాధికారులతోపాటు స్థానిక అధికారులకు లిఖిత పూర్వకంగా లెటర్ రాసి ఇచ్చానని స్పష్టం చేశారు. మాజీ సైనికుడినని, తనకు ప్రభుత్వం అసైన్డ్ భూమి కేటాయించిందని చెబుతున్న నారాయణ ఆర్డర్ కాపీ చూపించాలని సవాల్ విసిరారు. అసైన్డ్ బఫర్‌జోన్‌లో నిర్మించిన షెడ్లను తొలగించి, పట్టాను రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు శివరాజ్‌పాటిల్, తాజా మాజీ కౌన్సిలర్లు శివకుమార్, చౌదరి ప్రకాష్, ఇంద్రమోహన్‌గౌడ్, షమీ, అంజయ్య, శ్రీశైలం, శ్రీనివాస్ నాయక్, విద్యాసాగర్‌రెడ్డి, వీరేశం, నాయకులు శివ, గందిగరాజు, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



అల్తాఫ్



షేక్ అవేజ్



సల్మాన్



సమీర్

జహీరాబాద్ టౌన్: తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో జహీరాబాద్ మండలంలోని అల్గోల్ మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ జే.రాములు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎండీ.అల్తాఫ్ 7210వ ర్యాంక్, అగ్రి, ఫార్మా విభాగంలో షేక్ అవేజ్‌కు 8214, ఎండీ సల్మాన్‌కు 8963, సమీర్‌కు 9463వ ర్యాంకులు సాధించారని చెప్పారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్ విభాగంలో 35 మంది పరీక్ష రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. గురుకుల విద్యార్థులు ఈఏపీసెట్‌లో మంచి ఫలితాలు సాధించడంతో ఆర్‌ఎల్‌ఎస్ అధికారి దీవం, జిల్లా సమన్వయకర్త వసీమొద్దీన్ విద్యార్థులను అభినందించి బహుమతులను ప్రదానం చేశారని ప్రిన్సిపాల్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు జమ్గి(కే)లో కాలకీర్తన

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని జమ్గి(కే) గ్రామంలో వారం రోజులుగా స్థానిక హనుమాన్ అలయంలో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహంలో భాగంగా ఆదివారం గాథపూజ నిర్వహించారు. సోమవారం ఉదయం గోపాల కాల కీర్తనలో భాగంగా వార్‌కారీ సంప్రదాయంలో భజనలు చేస్తూ గ్రామంలోని దేవతలకు పూజలు చేయనున్నట్లు తెలిపారు. కాలకీర్తనతో అఖండ హరినామ సప్తాహం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

◆ ఘనంగా బ్రహ్మోత్సవాలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి మల్లెపూలతో విశేష పూజ, నరసింహ హోమం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, వాహన సేవ కార్యక్రమాలు నిర్వహించారు.

◆ ఉరుములు, మెరుపులతో వర్షం

మునిపల్లి(అందోల్): మండల పరిధిలో ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని మక్తక్యాసారం, గార్లపల్లి, చీలపల్లి, బేల్లూర్ గ్రామాలతో పాటు అయా గ్రామాల్లో వర్షం పడింది. ఈదురు గాలులు వీచడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు.

◆ చలివేంద్రం ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ షాపింగ్ సెంటర్ వద్ద శ్రీబాలాజీ ఫౌండేషన్ చైర్మన్ బలరాం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆదివారం వర్తక సంఘం అధ్యక్షుడు జైరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో యువజన సంఘాలు చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బాటసారులకు మజ్జిగ అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, భూషణం, రవి కుమార్, ప్రవీణ్, మధుసూదన్ రావు, ప్రభాకర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మాజీ ఎంపీ పరామర్శ

నారాయణఖేడ్: సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌కు చెందిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్‌రాజ్ శేరికార్‌పై ఇటీవల కొందరు దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ ఆదివారం ఖేడ్‌కు వచ్చి అరుణ్‌రాజ్‌ను ఆయన నివాసంలో పరామర్శించారు. ఆయన వెంట ఖేడ్ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, నాగల్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌పాటిల్, పట్నం మాణిక్, జ్ఞానేశ్వర్ ఉన్నారు.

◆ అనారోగ్యంతో పీఏసీఎస్ డైరెక్టర్ మృతి

నారాయణఖేడ్: మండలంలోని అనంత సాగర్‌కు చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బక్క శంకరయ్య(70) ఆదివారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు పండరి రెడ్డి, లోకేశ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

◆ గుండె పోటుతో కాంగ్రెస్ నేత..

కల్హేర్(నారాయణఖేడ్): గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి చెందాడు. మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన ఎండి.ఖయ్యూమ్(42) రెండు రోజులుగా వరి ధాన్యం ఆరబెట్టే పనులు చేశాడు. శనివారం రాత్రి ఇంటికి వెళ్లి భోజనం చేశాడు. అనంతరం ఛాతీలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అతడు మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, విజయ్‌పాల్‌రెడ్డి మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

◆ రెడ్డి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీలో రెడ్డి సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడు సరెడ్డిగారి వెంకట్‌రెడ్డి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కలకంటి రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దేవేందర్ రెడ్డి, కోశాధికారిగా అమ్మగారి రవీందర్ రెడ్డిలతో పాటు ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేయనున్నట్లు అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి తెలిపారు.

మెథడిస్ట్ జాతరకు పోటెత్తిన జనం



జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ గార్డెన్ నగర్‌లో జరుగుతున్న మెథడిస్ట్ క్రైస్తవ ఉజ్జీవ సభల జాతరకు జనం పోటెత్తారు. జాతరకు ఆదివారం చివరి రోజు కావడంతో జహీరాబాద్ నియోజవకర్గం నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు, ప్రజలు తరలిరావడంతో పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి. జాతరను ఎమ్మెల్యే మాణిక్‌రావు ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి జెండాలతో ఊరేగింపుగా వచ్చారు. అలాగే ఉచిత మెగా వైద్య శిబిరం, ఆటల పోటీలు, భజన పోటీలతో పాటు ఏసుక్రీస్తు జీవిత చరిత్ర చలన చిత్రం కూడా ప్రదర్శించారు. రాత్రి పాస్టర్లు దైవారాధన, దైవ సందేశం, రోగులకు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా జాతర కమిటీ నాయకులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.